వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం


పార్టీలో చేరిన 37వ డివిజన్ యువకులతో నెల్లూరురూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో పెద్ద ఎత్తున చేరుతుండడం శుభపరిణామం.ఈ చేరికలు తమ పార్టీ విజయానికి ఎంతో దోహదపడుతాయి. త్వరలో జరిగే ఎన్నికల్లో తమ పార్టీ విజయం ఖాయం' అని ఆ పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్, కనుపర్తిపాడుకు చెందిన వంద మంది క్రైస్తవులు జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ దాసరి రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు ఆదాలను మినీబైపాస్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనతో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, నాయకులు ఉదయగిరి నరసింహులు గౌడ్, లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, మాదా బాబు, బెల్లంకొండ వెంకయ్య, రైల్వేబోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య 24వ డివిజన్ ఇన్‌చార్జులు నీళ్ల సునీల్‌యాదవ్, ఉడత మురళీయాదవ్, ఇసనాక సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• గత కార్పొరేషన్ ఎన్నికల్లో 31వ డివిజన్ నుంచి కమ్యూనిస్ట్ పార్టీ తరుపున పోటీ చేసిన ఓబుల రమాదేవి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం ఆమె ఆదాలను నగరంలోని మినీబైపాస్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో డివిజన్ నేతలతో కలిసి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 31వ డివిజన్ ఇన్‌చార్జులు చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, అయిరెడ్డి సుబ్బారెడ్డి, టీవీఎస్ కమల్, బోయిల్లా ఆదిరెడ్డి, డివిజన్ నాయకులు కాలేషా, జయరామిరెడ్డి, రఫీ తదితరులు ఉన్నారు.

• 33వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బెజవాడ మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆదాల మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జే శ్రీనివాసులు, పీ శేషమ్మ, షేక్ రజియా, ఆంథోనమ్మ, షేక్ సిరాతున్నీసా, తదితరులు ఉన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, 33 వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, కొండేటి శివారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది యువకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాబ్జి, శ్రీకాంత్, జయరామయ్య, శివ, సుధీర్, భరత్, శీనయ్య మురళి, తదితరులతో పాటు వారి మిత్రబృందం ఉన్నారు. ఏఎంసీ చైర్మన్ పీ కోటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ మూలే విజయభాస్కర్ రెడ్డి, నాయకులు ధారా వంశీ, రొంపిచర్ల సుబ్బారెడ్డి, మాదా బాబు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన 33వ డివిజన్ వారితో ఆదాల


పార్టీలో చేరిన 24వ డివిజన్ క్రైస్తవులతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి


రమాదేవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల

క్లుప్తంగా

స్వేచ్ఛగా ఓటు వేయాలి



తోటపల్లిగూడూరు : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఈ మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు. మండలంలోని కోడూరు పంచాయతీలో పలు మత్స్యకార గ్రామాల్లో కేంద్ర, పోలీస్ బలగాలతో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో కవాతు చేస్తూ స్వేచ్ఛగా ఓటు వేయాలని ఓటర్లకు అభయం ఇచ్చారు. అనంతరం ఎస్సై జంపానికుమార్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్టీ అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

పెట్రోలు బంకులో తహసీల్దార్ తనిఖీ



సీతారామపురం (ఉదయగిరి): మండలంలోని బసినేనిపల్లి, సీతారామపురంలో ఉన్న ఇండియన్ ఆయిల్, హెచ్‌పీ పెట్రోలు బంకులను తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్చిలో డీజిల్, పెట్రోలు విక్రయాల రికార్డులు పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేసే వివరాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనతో పాటు ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో ఖాజామొహిద్దీన్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు సోమవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి పండరి భజనలు, చెక్క భజనలు, స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, ఉభయకర్తలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వసంతోత్సవం, ఏకాంతసేవ

బ్రహ్మోత్సవాల చివరిరోజైన సోమవారం వసంతోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ధ్వజావరోహణం, హోమం, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. వసంతోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వెన్నుపోటుకు కేరాఫ్ టీడీపీ

ఇందుకూరుపేట : వెన్నుపోటు రాజకీయాలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కేరాఫ్‌గానే నిలుస్తోంది. తాజాగా టీడీపీలో ఆది నుంచి జెండా మోసిన పార్టీ నేతలను పక్కన పెట్టి వలస నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంపై తెలుగు తమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు రావెళ్ల వీరేంద్రనాయుడును ఆ పార్టీ నాయకులు పక్కన పెట్టేయడం చర్చనీయాంశమైంది. ఇందుకూరుపేట, కోవూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాలకు సంబంధించి ఆత్మీయ సమావేశం సోమవారం కోవూరులో నిర్వహించారు. దీనికి అన్ని పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు జనాన్ని తరలించారు. అయితే ఈ సమావేశానికి సంబంధించి వీరేంద్రకు ఆహ్వానం అందలేదని తెలిసింది. ఆదివారం రాత్రి గంగపట్నంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి నిరసన సెగ తగలడంతో స్థానిక నేత సుధాకర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరుకాకుండా తిరిగి వెళ్లిన విషయం తెలిసిందే. దీనిని మనుస్సులో పెట్టుకున్న ఆపార్టీ నాయకులు వీరేంద్రతో పాటు ఆయన అనుచరులకు ఆహ్వానం పంపలేదని తెలిసింది. గంగపట్నంలో సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డిది అదే తీరుగా ఉంది. ఆయనకు ఆహ్వానం లేకపోవడంతో సమావేశానికి వెళ్లలేదు. ఆయన ఎంత వారించినా మాట వినకుండా ఆ గ్రామం నుంచి తెలుగు తమ్ముళ్లు సమావేశానికి తరలిపోయారని తెలిసింది. ఈ దుస్థితికి వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి కారణమని వారు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

నెల్లూరు సిటీ: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ రావు శ్రీనివాసులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 20వ డివిజన్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ కరపత్రాలను అందజేసి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ జిల్లా మహిళా సెక్రటరీ పోతురాజు రమాదేవి, డివిజన్ నాయకులు ఆరుగుంట రాజారెడ్డి, కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, గొడుసు సరళమ్మ, గడ్డం రఘురామయ్య, మారెళ్ల రాజశేఖర్, గద్దే అబ్రహం, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇఫ్తార్ విందులో ఆదాల

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గం, 38వ డివిజన్‌లోని టెక్కేమిట్టలోని మహబూబియా మసీదులో స్థానిక కార్పొరేటర్ దాసరి అమృత, డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్ష చేయడం వారి దైవభక్తికి నిదర్శనమన్నారు. రూరల్ నియోజకవర్గంలోని ప్రతి ముస్లిం కుటుంబానికి అల్లా దయ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ ఖాదరి, షేక్ అలీం, సంధానిబాషా, ఖలీల్, సుభాహాని, అజీజ్, జియా, గయాజ్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పెళ్లకూరు కిరణ్‌కుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నాయబ్ రసూల్, పాతపాటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆదాల, ఆనం

నోట్ల కోసం విమర్శలు తగవు

నెల్లూరు(దర్గామిట్ట): వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మద్దతుగా నోట్ల కోసం కొందరు తమ పార్టీ నాయకులపై విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామని వైఎస్సార్సీపీ నాయకురాలు అరుణ అన్నారు. మాగుంటలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు నేరుగా వెళ్లగలిగే వ్యక్తి, నెల్లూరును అభివృద్ధి ప్రధాన నడిపించగల వ్యక్తి విజయసాయిరెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన రాజకీయ భిక్షతో వేమిరెడ్డి కుటుంబం పదవులు పొందిందన్నారు. వేమిరెడ్డికి మద్దతుగా చిల్లర గ్యాంగ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. వారు చేసిన రౌడీయిజాలు, భూకబ్జాలు, అన్యాయాలు బయట పెడితే ఏమవుతారని ప్రశ్నించారు. తమ నాయకుడు విజయసాయిరెడ్డి గురించి మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. విజయసాయిరెడ్డి ఎంపీగా గెలిస్తే నెల్లూరు రూపురేఖలు మారుతాయన్నారు. ప్యాకేజీల కోసం బురదజల్లితే సహించేది లేదన్నారు. విజయసాయిరెడ్డిని మరోమారు విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు అరవ ప్రమీల, వీ సరిత, కరుణ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న అరుణ

సామూహిక సత్యనారాయణ వ్రతం



సంగం: స్థానిక బాలచౌడేశ్వరీదేవి ఆలయంలో రమాదేవి సమేత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాన్ని సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులతో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు.

స్వర్ణ మహాలక్ష్మీదేవికి పుష్పాభిషేకం


విశేషాలంకారంలో స్వర్ణమహాలక్ష్మీదేవి


అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణ యోగమందిర ప్రాంగణంలోని అష్టలక్ష్మి మందిరంలో స్వర్ణమహాలక్ష్మీదేవికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని ఉదయం స్వర్ణమహాలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, ఉత్సవమూర్తికి నాణేములతో అభిషేకం, లక్షకుంకుమార్చన, రుద్రహోమం, అష్టలక్ష్మి హోమం, తదితర పూజలు విశేషంగా నిర్వహించారు. రాత్రి స్వర్ణమహాలక్ష్మి పల్లకిసేవ కనులపండువగా జరిగింది. శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): అయ్యప్పస్వామి, మహాలక్ష్మి జయంతులను పురస్కరించుకుని వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి మందిరంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామితో పాటు గురువాయూర్ మహావిష్ణు సన్నిధిలోని మహాలక్ష్మికి కేరళ సంప్రదాయ రీతిలో తిరుమంజనం, విశేష పుష్పార్చన,, సహస్ర నామార్చన, శాత్తుమొరై, పుష్పాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చిన అయ్యప్పస్వామి, మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పన్ను బకాయిదారుల కుళాయి కనెక్షన్ల తొలగింపు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని 10వ వార్డులో ఇంటి, కుళాయి పన్నులు అధికంగా బకాయిలున్న వారి కుళాయి కనెక్షన్లను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల ప్రజలు ఇంటి పన్నులు ఒక్కసారిగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు ప్రయత్నిస్తే సర్వర్ డౌన్ అయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల పన్ను బకాయిదారులు ఆ లోపు చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ అవకాశాన్ని కల్పించిందన్నారు. అందువల్ల వీలైనంత త్వరితగతిన పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


కుళాయి కనెక్షన్లను తొలగిస్తున్న అధికారులు

హోలీ.. రంగుల రంగోలీ

• సింహపురిలో ఘనంగా సంబరాలు

నెల్లూరు(బృందావనం): రంగుల పండగ హోలీని సింహపురిలో సోమవారం ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకున్నారు. నగరంలో ఉత్తర భారతీయులు అధికంగా నివసించే రాయాజీవీధి, కాపువీధి, మండపాలవీధి, పెద్దబజారు, చిన్నబజారు, సంతపేట తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచుకున్నారు. శ్రీరాజ్‌పురోహిత్ ఖేతేశ్వర్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. హోలీ వేడుకల్లో భాగంగా శనివారం సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో గడిపారు. ఆదివారం హోలికా దహనం రాయాజీవీధిలో నిర్వహించారు. ఫాల్గుణ పూర్ణిమను పురస్కరించుకుని రాయాజీవీధిలోని శ్రీరాజ్‌పురోహిత్ ఖేతేశ్వర్ సమాజ్ మందిరంలో, ఆలయాల్లో, వివిధ మందిరాల్లో పూజలు నిర్వహించారు.

•నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో మినీబైపాస్‌రోడ్డులోని వసంతోపుసెంటర్‌లో నర్సరీలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగవరానికి చెందిన విద్యార్థిని హర్షిత హోలీ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా సుభద్రాదేవి మాట్లాడుతూ వసంత మాసంలో ప్రకృతి అందాలు ఆనందం కలిగిస్తాయన్నారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు వివిధ ఫలాలు, కాయగూరల రసాలు, పసుపు, కుంకుమ కలిపిన ద్రావణాలతో హోలీని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, యువత శ్రీలత, రామ్మోహన్, వేణు, సుందరి, ధనుంజయ్, కృష్ణవేణి, లత తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ న్యాయ కళాశాలలో..

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ న్యాయ కళాశాలలో వీఆర్ లా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకంక్షలు తెలుపుకున్నారు. తొలిసారిగా కళాశాలలో హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సమాజంలో న్యాయ పరిరక్షణకు తమవంతు పాటు పడుతామన్నారు.


రాయాజీవీధిలో హోలీ సంబరాలు జరుపుకొంటున్న ఉత్తరభారతీయులు


ఆచారివీధిలో రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు


హోలీ సంబరాలు చేసుకుంటున్న యువకులు


బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో...


వీఆర్ న్యాయ కళాశాలలో..

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు నెల్లూరురూరల్ రాజకీయ అంశాలపైన, హోటల్స్ పరిశ్రమపైన, కళాకారుల సమస్యలపైన సమగ్రంగా చర్చించారు. ఆయన వెంట అమీర్‌జాన్, హరినాథ్‌రెడ్డి, పలువురు కళాకారులు ఉన్నారు.

రేపు సర్టిఫికెట్ల పంపిణీ

ఉదయగిరి: పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా పీఎం విశ్వకర్మ పథకంలో రెండు నెలల క్రితం తాపీ పనిలో ఆరు రోజుల పాటు శిక్షణ పొందిన వారికి బుధవారం స్థానిక నేక్ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందినవారు తప్పనిసరిగా హాజరై సర్టిఫికెట్లు తీసుకెళ్లాలన్నారు.

వీపీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది జగనే

నెల్లూరు(దర్గామిట్ట): వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విస్మరించడం ఏ పాటిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ అన్నారు. నగరంలోని మాగుంటలేవుట్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భిక్షతో ఎమ్మెల్యే అయిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వద్దకు నేరుగా వెళ్లగలిగే సత్తా తమ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఉందన్నారు. గతంలో గంటల తరబడి చంద్రబాబు దగ్గర నిరీక్షించిన వేమిరెడ్డి నేడు ఆయన దగ్గరకు వెళ్లడం ఏ పాటిదన్నారు. ప్రశాంతిరెడ్డి గతంలో రూరల్ టికెట్‌ను ఆశించినప్పుడు కోటంరెడ్డి మండిపడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్న కోటంరెడ్డి వైఎస్సార్‌సీపీ బీ-ఫారంతో గెలిచి పసుపు కండువా కప్పుకోవడం ఏపాటిదన్నారు. నెల్లూరు సిటీ, రూరల్ సీట్లు ఆశించి కోవూరు సీటు సంపాదించుకున్న ప్రశాంతిరెడ్డిపై కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన విమర్శలను కొందరు వక్రీకరిస్తున్నారన్నారు. వేమిరెడ్డి నోట్ల కట్టల కోసం కోటంరెడ్డి ఏ నియోజకవర్గ సమస్యలో అయిన జోక్యం చేసుకుంటారన్నారు. నోట్ల కట్టల కోసం వీపీఆర్ దగ్గరకు రాయభారం పంపిన మాట వాస్తవం కాదా అని కోటంరెడ్డిని ప్రశ్నించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నెల్లూరు పార్లమెంట్ స్థానంతో పాటు పది అసెంబ్లీ స్థానాలో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ప్రసాద్

న్యాయవాదుల మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్): జిల్లా కోర్టు హాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని అధ్యక్షతన న్యాయవాదుల మృతికి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు బూరగ మురళి, సీ మణి, మన్నెపల్లి వెంకటాద్రి, వసీంఅక్రమ్, అన్నదేవుల రామచంద్రారెడ్డికి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారి జీవిత విశేషాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ వివరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.